క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు



గంగవరం: రాష్ట్ర విద్యుత్, అటవీశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుంగనూరు పర్యటన నిమిత్తం వెళ్తున్న మంత్రిని గంగవరం ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్ద కలిసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ నేత ఆర్‌వీఎస్ బోస్, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, గంగవరం, పెద్దపంజాణి మండలాల పార్టీ కన్వీనర్లు మోహన్‌రెడ్డి, బాగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పలమనేరు ఏరియా ఆసుపత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు చంద్రప్ప, పట్టాభిరామయ్య, ముజ్జు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



టాలెంట్ టెస్ట్ విజేతలు యతీష్‌రెడ్డి, దిగ్నసాయి, నిహారెడ్డి

పుంగనూరు: చెకుముఖి టాలెంట్ టెస్ట్ 2024లో ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పట్టణానికి చెందిన ఇంపల్స్ స్కూల్ విద్యార్థులు యతీష్‌రెడ్డి, దిగ్నసాయి, నిహారెడ్డి గెలుపొందారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతున్నట్లు హెచ్‌ఎం సంతోష్ మన్నార్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ముచ్చటగా మూడోసారి..



బాలసుబ్రమణ్యం

పుంగనూరు: పుంగనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బాలసుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘ సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను మూడవ సారి సంఘ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, సంఘాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పుస్తకాల పంపిణీ



గ్రంథాలయ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పలమనేరు: పుస్తకాలతో పిల్లలు స్నేహం చేస్తే సమాజాన్ని, ప్రపంచాన్ని చదవడానికి మార్గం చూపుతాయని పలమనేరు, గంగవరం ఎంఈఓలు లీలారాణి, వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులకు పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు గ్రంథాలయ పుస్తకాలను ఎంఈఓల చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలే నిజమైన స్నేహితులని వారు తెలిపారు. హాస్టల్ వార్డెన్ సోమసుందరం రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి 'జన్ భగీదారీ'

పలమనేరు: సచివాలయాల్లో సోమవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించే జన్ భగీదారీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శృతివనం పేరిట ఈనెల 19 సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ఈ నేపథ్యంలో స్థానికంగా ఈ కార్యక్రమాలను మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఈరోజు

వైఎస్సార్ సీపీ సమీక్ష

కుప్పం: కుప్పం మండలంలోని పంచాయతీల వారీగా సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంకాలం వరకు సమీక్ష నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలంలోని అన్ని పంచాయతీల వైఎస్సార్ సీపీ సర్పంచులు. ఎంపీటీసీలు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరాయి.

రామకుప్పంలో రేపు

రామకుప్పం: మండలంలోని 23 పంచాయతీల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమీక్షించనున్నట్టు ఎమ్మెల్సీ భరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకందగానిపల్లెలోని చంద్రారెడ్డి గెస్ట్‌హౌస్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే సమీక్షలో తనతోపాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, బైరెడ్డపల్లె ఎంపీపీ రెడ్డెప్ప, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి పాల్గొంటారన్నారు.

కాపుల అభ్యున్నతిని విస్మరించిన బాబు

- రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషు



రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషును సత్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కాపుల అభ్యున్నతికి ఏ కోశానా కృషి చేయలేదని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు విమర్శించారు. ఆదివారం ఆయన పుంగనూరులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. కాపుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా కాపులకు సముచిత ప్రాధాన్యతనిచ్చి పదవులు కట్టబెట్టారన్నారు. వంగవీటి మోహన్‌రంగ, ముద్రగడ పద్మనాభంనే కాకుండా పలు కాపు నేతలను వేధించడం, కేసులను బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన హీనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఆ కేసులను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఎన్నికల నేపథ్యంలో బాబు మళ్లీ చెబుతున్న కల్లబొల్లి మాటలు, ఇస్తున్న హామీలను కాపులు నమ్మరాదని, విశ్వసనీయతకు మారుపేరైన కాపులందరూ జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శేషును సత్కరించారు. కార్యక్రమంలో ఎవరేం మాట్లాడారంటే..

సాయం కోరితే మంత్రి పెద్దిరెడ్డి అండ

– రెడ్డెప్ప, చిత్తూరు ఎంపీ



ఎక్కడివారైనా సాయం కోరి వస్తే వారికి అండగా నిలవడం మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ నైజమని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప అన్నా రు. ఎన్నో ప్రాంతాల వారు తమ కులస్తులకు చెందిన ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి సాయం కోరితే తన సొంత సొమ్మును మంత్రి పెద్దిరెడ్డి వితరణ చేస్తోందని ఆయన కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ఇవ్వడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు.

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

– ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు



చంద్రబాబునాయుడు ప్రతి ఒక్కరినీ మోసగించడం లక్ష్యంగా కుత్సిత రాజకీయాలు చేస్తారని చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు విమర్శించారు. తనకు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్టు ఇస్తానని రెండుసార్లు మొండిచెయ్యి చూపారని, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి తనకు టికెట్టు ఇచ్చి గెలిపించారన్నారు. బలిజల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. బలిజలను మభ్యపెట్టేందుకు టీడీపీ, ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా నమ్మరాదని, అందరూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

కాపుల రుణం తీర్చుకోలేం

– ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



బలిజ కులస్తులు ఐకమత్యంగా తమ కుటుంబానికి అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకోలేమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి బలంగా ఉన్న కాపుల ఓట్లను చీల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, అలాంటి వారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా ఉన్న కాపుల అభ్యున్నతికి కోసం ఆహర్నిశలూ కృషి చేస్తామని తెలిపారు.

పవనకళ్యాణ్ మనకు పనికిరాడు

– టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కాపులకు , సామాన్య ప్రజానీకానికి పనికిరాడని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ అన్నారు. తనకు చిరంజీవి కుటుంబంతో ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఎవరుగానీ వారి కుటుంబం ద్వారా లబ్ధి పొందిన కాపులు ఉన్నారా..?అని ప్రశ్నించారు. ఆ కుటుంబం కాపులతో లబ్ధిపొందుతారని, కాపులకు ఒరగబెట్టేది లేదన్నారు. పవన్‌కళ్యాణ్ ఎన్ని మాటలు చెప్పినా కాపులు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. మంత్రి పెద్దిరెడ్డి 30 ఏళ్ల క్రితం సోమల ఎంపీపీగా రామచంద్రయ్యను నిలబెట్టి కాపులకు అధిక ప్రాధాన్యత కల్పించారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో కాపులు ఐకమత్యంగా మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు.

వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సతీమణి దుర్గ

రామకుప్పం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ప్రజలను కోరారు. మండలంలోని ముద్దనపల్లె పంచాయతీ ఆదివారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారిని వివరించారు. కుప్పం ప్రజలకు భరత్ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అందుబాటులో ఉండటం లేదని, ప్రజలు ఇది గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ సికిందర్, ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్, స్థానిక నేతలు అశోక్, కుమార్, సుధాకర్, గంగాధరం, లోకేష్, మహదూర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



భోగిమంటలు చుట్టూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

వి.కోట: తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాతి పండుగ అని, మన సంప్రదాయాలను భావితరాలకు అందించాలని బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిణి ఉమాదేవి అన్నారు. ఆదివారం స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సిబ్బంది, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి, భోగిమంటలు, రంగులతో ముగ్గులు, గొబ్బిపాటలు పాటడం, గాలిపటాలు ఎగురవేయడం..ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరంముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సులోచన, రేణుక, అనిత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో 'పుష్ప'పరిమళం

- బంగారు పతకం సాధించిన దండపల్లె అమ్మాయి



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న పుష్పలత

గంగవరం: మండలంలోని దండపల్లెకు చెందిన ఓ పేదింటి అమ్మాయి ఎంటెక్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. అనంతపురంలోని జేఎన్‌టీయూఏలో శనివారం నిర్వహించిన వార్షికోత్సవంలో పీఎస్ దామోదరం ఎండోమెంట్ మెమోరియల్ అవార్డుతో పాటు ఆమె బంగారు పతకం అందుకుంది. గ్రామానికి చెందిన కొండయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పుష్పలత జేఎన్‌టీయూ కళాశాల ఎంటెక్ ఫలితాల్లో క్లాస్ టాపర్‌గా నిలిచింది. దీంతో కళాశాల తరపున విద్యార్థినికి గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

మండల కవులకు సత్కారం



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న శాంతకుమారి



కొఠారి వెంకటరత్నం

వి.కోట: మండలంలోని యల్లాగరం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొఠారి వెంకటరత్నం, స్థానిక బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శాంతకుమారి రాజమండ్రిలో సముచిత సత్కారం అందుకున్నారు. రాజారాజా నరేంద్రుల పట్టాభిషేకం జరిగి వెయ్యేళ్లు అయిన సందర్భంగా రాజమండ్రిలో ఆదివారం కవిసమ్మేళనం నిర్వహించారు. గోదావరి కవితా గానలహరి కార్య భాగంగా పాపికొండల నౌకా విహార కవితా గానంగా రెండు కవితలను మండల కవు లు వినిపించారు. వారిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ గజల్ శ్రీనివాసులు, కంచర్ల సుబ్బానాయుడు, డాక్టర్ ఆలపాటి తదితరులు పాల్గొన్నారు.

కూర్మాయిలో త్రైత సిద్ధాంత ప్రచారం



పుస్తకాలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

పలమనేరు: పట్టణానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రచారకులు ఆదివారం మండలంలోని కూర్మాయిలో భగవద్గీతపై ప్రచారం చేయడంతోపాటు ఆ పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంతం మేరకు భగవద్గీతను రాసిన శ్రీకృష్ణ పరమాత్ముడు సమాజానికి స్నేహితునిలా మంచిని నేర్పారని వివరించారు. ఉత్తరాయణ పుణ్యకాలం విశిష్టతను వివరించారు. కమిటీ సభ్యులు భాస్కర్, బాలాజీ, జ్యోతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మార్పు



విద్యుత్ లైన్ల మార్పు పనులను పర్యవేక్షిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్

చౌడేపల్లె: స్థానిక బస్టాండులో పలమనేరు వైపు వెళ్లే మార్గంలో నివాస గృహాలకు తగిలేలా ఉంటున్న విద్యుత్ లైన్లను ఆదివారం యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌కో అధికారులు మార్చారు. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికు ప్రజలు విద్యుత్ లైన్ల సమస్యను నివేదించడంతో ఆయన స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పర్యవేక్షణలో నూతనంగా 15 ఎత్తైన స్తంభాలు ఏర్పాటు చేసి 3 ఫేజ్ 5లైన్లు వైర్లను నివాస గృహాలు, భారీ వాహనాలకు తగలని విధంగా అధికారులు మార్చారు. మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



ఫ్లెక్సీలను పరిశీలిస్తున్న సీఐ లింగప్ప

వి.కోట: వాహదారులు, డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ లింగప్ప కోరారు. ఆదివారం మండలంలోని దాసార్లపల్లె, పాపేపల్లిమిట్ట, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద, వి.కోట–పలమనేరు జాతీయ రహదారిలోని కుమ్మరమడుగు గ్రామం వరకు పలు చోట్ల డ్రైవర్లు, వాహనదారుల అవగాహన నిమిత్తం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సీఐ మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమని, ఆ అలవాటు ఉన్నపక్షంలో తమకోసం ఎదురు చూసే కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను అవకాశం ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- 650 మందికి వైద్య పరీక్షలు
- రోగులకు మందులు, భోజన వసతి



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేంద్ర బాబు తదితరులు



వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ బాలసముద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించినది. శిబిరాన్ని మాజీ ఎంపీపీలు వెంకటరమణరాజు, చంద్రవదన, ప్రదీప్‌రాజు కలిసి ప్రారంభించారు. తొలుత స్వామివివేకానంద జయంతి పురస్కరించుకుని నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ రాజమణి ఏర్పాటు చేసిన వివేకానంద చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం వివిధ రాష్ట్రాల ప్రముఖ వైద్యులు పవన్, రంజిత్, నాగేంద్ర, గణేష్, పీతాంబరం, సుధాకర్ వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండంలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 650 మంది రోగులు హాజరయ్యారని, వారికి భోజన సదుపాయం కూడా కల్పించినట్టు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తులసీరాం, కోశాధికారి నరేష్ బాబు కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు, సభ్యులు మోహన్‌కుమార్, మణి, బాలసుబ్రమణ్యం, భానుప్రకాష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం



బోయకొండ గంగాపురంలో చేస్తున్న బోర్ డ్రిల్లింగ్ పనులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులు, యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించడమే తన ధ్యేయమని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. ఆదివారం ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రం వద్ద భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. అమ్మవారి దర్శనం, వసతులు ఎలా ఉన్నాయో భక్తులను అభిప్రాయం తెలుసుకున్నారు. దర్శనానంతరం ఉచిత ప్రసాదంతోపాటు అమ్మవారి కుంకుమ, పూలు, పండ్లు అందజేసేందుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే బోయకొండ గంగాపురంలో పుంగనూరు శ్రీ వెంకట గణపతి బోర్‌వెల్స్ నిర్వాహకులు గురుప్రసాద్ కుటుంబ సభ్యులు ఆదివారం చైర్మన్‌తో కలిసి బోరు డ్రిల్లింగ్‌కు పనులు ప్రారంభించారు. బోర్‌వెల్స్ నిర్వాహకులను చైర్మన్ సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

జగను..చల్లగా ఉండాలయ్యా!



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి(ఫైల్)

పలమనేరు : మూడువేల పింఛను పొందుతున్న అవ్వాతాతలు, వితంతువులను జగను చల్లగా ఉండాలయ్యా అని నిండుమనస్సుతో ఆశీర్వదిస్తున్నారు. తమకు ఎవరూ అండగా లేకున్నా మనవడిగా, కొడుకుగా జగన్ పింఛను ఇచ్చి ఆదుకుంటున్నాడని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడువేలతో నా కష్టాలు తీరినట్టే



నాయనా గతంలో తక్కువ పించనుతో ఇబ్బందులు పడ్డాం. జగన్ మూడువేలు ఇస్తాడంట అంటే ఎవరూ నమ్మలేదు. ఇప్పుడు మూడు వేలు ఇస్తుంటే కుళ్లుకుంటున్నారు. ఈ మూడువేలు నాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తోంది. నా బిడ్డలకంటే జగన్ బిడ్డ బాగుండాలని ఆశీర్వదిస్తున్నా.

–రాజమ్మ, కొత్తబూరగపల్లె, పెద్దపంజాణి మండలం

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా....



మా ఇంటాయన ఈమధ్య ఏనుగు దాడిలో చనిపోయాడు. తక్షణమే స్పందించిన జగనన్న ప్రభుత్వం మాకు రూ.5లక్షలను సాయంగా అందజేసింది. అంతేకాకుండా వితంతు పెన్షన్ అప్పటికప్పుడే మంజూరు చేశారు. జగనన్న ఇచ్చే మూడు వేలతో నా కుటుంబానికి ఏ ఇబ్బందీ లేకుండా చూసుకుంటా.

–అరుణ, ముదిరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలం

బిడ్డ కంటే జగనే ఎక్కువ



మాఆయన ఈమధ్యనే చనిపోయాడు. నాకు దిక్కుతోచలేదు ఎట్లా బతకాలా? అని. అయితే మా వలంటీర్ వచ్చి ధైర్యం చెప్పింది. మూడు వేల పింఛనును నెలలోపే ఇప్పించింది. నిజంగా జగన్ నా కడుపులో పుట్టిన బిడ్డకంటే ఎక్కువ అనుకుంటున్నా.

–లక్ష్మీదేవి,పెదరాంపల్లె, వీ.కోట మండలం

నా ఆశీస్సులు ఎప్పుడూ జగన్‌కే



నా భర్త ఇటీవలే చనిపోయాడు. వలంటీర్ రాసిన వెంటనే నాకు రూ.3వేల పింఛను అందింది. నిజంగా జగన్‌మోహన్‌రెడ్డి నాలాంటి తోడు కోల్పోయిన వారికి దేవుడిలాగా ఆదుకుంటున్నాడు. ఆయనకు నా ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయి. –సుకన్య, యాదకుండ, వీ.కోట మండలం

పెన్షనర్ల గుండె చప్పుడు సీఎం

- రూ.3వేల పింఛనుపై సర్వత్రా హర్షం
- తమకెంతో నిశ్చింత అంటున్న లబ్ధిదారులు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్ (ఫైల్)

కుప్పం: సామాజిక పింఛన్ల సొమ్ము పెంపు కుప్పం నియోజకవర్గంలో 38,972 మంది జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపింది. ఇచ్చిన హామీ మేరకు రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకు దశలవారీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను పెంచారు. ఫలితంగా నెలకు నియోజకవర్గంలో రూ.13.2కోట్లను పింఛన్ల రూపేణా లబ్ధిదారుల ఇస్తుండడంతో తమ జీవితానికి గుండె చప్పుడయ్యారని సీఎంను నిండుమనస్సులో ఆశీర్వదిస్తున్నారు. పింఛన్ల పెంపుదలపై జనంలో వైఎస్సార్ సీపీకి మరింత ఆదరణ పెరగడంతో టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రభుత్వం, సీఎం జగన్ దుష్ప్రచారానికి తెర దీసినా ప్రజలు వారినే తిట్టిపోస్తున్నారు.

కుప్పం నియోజకవర్గంలో ఇస్తున్న సామాజిక పింఛన్లు

మండలం	పింఛన్లు	కొత్త పింఛన్లు	నగదు (రూ.లలో)
కుప్పం	14,981	172	4,50,70,500
శాంతిపురం	8,387	146	2,49,87,500
గుడుపల్లె	5,876	103	1,75,00,000
రామకుప్పం	8,865	137	26,74,900
	38,109	558	9,02,32,900

మునలోళ్లకు దేవుడు సామీ



ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే చాలు ఇంటికే వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇస్తాండారు. ఇంతకుముందు ఈ మాదిరిలా. కన్నబిడ్డలే సరిగా పట్టించుకోని ఈ రోజుల్లో ఠంచనుగా మాకు పింఛన్లు ఇచ్చేలా చేసిన దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి. – శ్రీనివాసులు, కొత్తపేట, కుప్పం

మనవడు జగన్ చల్లగా ఉండాలి



మునలోళ్లు, భర్త చనిపోయినోళ్లు, వికలాంగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీనే తలుపు తట్టి పింఛను ఇస్తున్నారు. 60 ఏళ్లు నిండిన మాకు తొలిసారి 3 వేల రూపాయలు ఇచ్చినారు. చానా సంతోషంగా ఉంది నాయనా. మా మనవడు జగన్ చల్లగా ఉండాలి.

– మణి, సంపంగి నగర్, కుప్పం

ఎంతో సంతోషం



జనవరి నుంచి మూడువేల రూపాయల పింఛను అని చెప్పి, వలంటీరు మా ఇంటికాడికే వచ్చి పింఛను డబ్బులిచ్చినారు. ఎంతో సంతోషంగా ఉందయ్యా. జగన్‌కు మేమంతా రుణపడి ఉండాం.

– లోకేశ్వరన్, రామ్‌నగర్,కుప్పం

మళ్లీ జగనే సీఎం కావాలి



ప్రతి నెలా పింఛన్ ఇస్తాండారు. సీఎం జగన్ మేలు మరచిపోము. ఈ పింఛన్ వల్ల మేము సంతోషంగా బతుకుతాండా. జగన్ చెప్పిన మాట ప్రకారం రూ.3వేలు ఇచ్చినారు. మళ్లీ జగనే సీఎం కావాలి.

–గంగమ్మ, గోవిందపల్లె, గుడుపల్లె మండలం